అప్రోచ్ లేక అవస్థలు


అప్రోచ్ లేని పెదపులివర్రు వద్ద నిర్మించిన కొత్త వంతెన


బ్రిటిష్ కాలం నాటి పురాతన వంతెనపై రాకపోకలు

డెల్టా ఆధునికీకరణ పనుల్లో భాగంగా ఏడేళ్ల క్రితం కృష్ణా పశ్చిమ బ్యాంక్ కెనాల్‌పై పెదపులివర్రు, ఓలేరు గ్రామాల్లో రూ.1.76 కోట్లతో రెండు వంతెనలు నిర్మించారు. వీటికి అప్రోచ్ రోడ్లు వేయలేదు. ఇటీవల ఓలేరులో అప్రోచ్ రోడ్డు వేశారు. కానీ పెదపులివర్రులో అప్రోచ్ నిర్మించలేదు. దీంతో బ్రిటీష్ కాలంలో నిర్మించిన పాత వంతెనపైనే గ్రామస్తులు రాకపోకలు సాగిస్తున్నారు. ఈ పురాతన వంతెన కూడా శిథిలావస్థకు చేరింది. ఎదురెదురుగా వాహనాలు వస్తే తప్పించుకోవడానికి అవకాశం ఉండడం లేదు. ఫలితంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. కొత్తగా నిర్మించిన వంతెనకు ఇప్పటికైనా అప్రోచ్ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.
– భట్టిప్రోలు

‘జ్వర’భద్రం

- ప్రబలుతున్న జ్వరాలు
- ఇంటింటా సర్వే చేస్తున్న వైద్యసిబ్బంది
- ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైనం


చావలి గ్రామంలో సీజనల్ వ్యాధులపై సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

వేమూరు: వర్షాకాలం, ఆపై వరదలు సంభవించాయి. ఈ నేపథ్యంలో గ్రామాల్లో విష జ్వరాలు ప్రబలుతున్నాయి. దీంతో వైద్యారోగ్యశాఖ సిబ్బంది ఇంటింటి సర్వే చేపట్టారు. జ్వర పీడితుల గుర్తింపునకు చర్యలు చేపట్టారు. అలాగే పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచిస్తున్నారు. మండల ప్రాథమిక వైద్యాధికారి వెంకట సురేష్ ఆధ్వర్యంలో సర్వేతోపాటు అవగాహన కార్యక్రమాలు జరుగుతున్నాయి. గ్రామాల్లో పారిశుద్ధ్యంపై పంచాయతీ అధికారులు చర్యలు చేపడుతున్నారు. దోమల మందు ఫాగింగ్ చేయిస్తున్నారు.

అప్రమత్తంగా ఉండండి

గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. మాస్కులు ధరించాలి. కాచి చల్లార్చిన నీటిని తాగాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. లేకుంటే దోమలు ప్రబలి వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంటుంది.
– డాక్టర్ సురేష్, మండల ప్రాథమిక వైద్యాధికారి, పెరవలి.

క్లుప్తంగా

ఎరువుల షాపులలో ఆకస్మిక తనిఖీలు



కర్లపాలెం: ఎరువులు, పురుగు మందులు ఎమ్మార్పీ ధరలకే అమ్మాలని కర్లపాలెం ఏవో సుమంత్‌కుమార్ తెలిపారు. ఆదివారం కర్లపాలెం మండలంలోని పలు ఎరువుల దుకాణాలలో ఏవో తనిఖీలు నిర్వహించి రికార్డులు పరిశీలించారు.

యోగాతో ఆరోగ్యం



చెరుకుపల్లి: యోగాతో ఆరోగ్యం సిద్ధిస్తుందని యోగా గురువు కొడాలి సరళాదేవి అన్నారు. సహజ యోగా ఉపాసకురాలు నిర్మలాదేవీ మాతాజీ శిష్య బృందం సహజ యోగంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు మండల కేంద్రమైన చెరుకుపల్లిలో ఆదివారం నిర్వహించిన ర్యాలీని ఆమె ప్రారంభించారు. యోగా విశిష్టత గురించి వివరించారు. కార్యక్రమంలో సుబ్బారావు, సి.హెచ్.వెంకట్రావు, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు వితరణ



రేపల్లె రూరల్: ఇటీవల కృష్ణానదికి వచ్చిన వరదలతో నిర్వాసితులైన బాధిత కుటుంబాలకు పట్టణంలోని రామకృష్ణ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ఆదివారం సాయం అందించారు. రామకృష్ణ పబ్లిక్ స్కూల్ యాజమాన్యం, విద్యార్థులు, మాజీ మంత్రి జాగర్లమూడి లక్ష్మీ పద్మావతి సహకారంతో సమకూర్చిన దుప్పట్లను 160 కుటుంబాలకు ఉప్పాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.

హిందూ శ్మశాన వాటికలో కుళాయిలు ప్రారంభం



అద్దేపల్లి(భట్టిప్రోలు): భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లి హిందూ శ్మశాన వాటికలో కర్మకాండల అనంతరం స్నానాలు ఆచరించేందుకు నూతనంగా నిర్మించిన కుళాయిలను ఆదివారం ప్రారంభించారు. గ్రామానికి చెందిన కుందేటి లక్ష్మీన్నారాయణ–ధర్మపత్ని శామలాంబ జ్ఞాపకార్థం వారి కుమారుడు శ్రీరాములు–అంకమ్మ దంపతులు రూ.1.25 లక్షలతో ఈ కుళాయిలను ఏర్పాటు చేశారు. అలాగే శ్మశానంలో దహన వాటికను నిర్మించిన విశ్రాంత ఉపాధ్యాయులు బొలిశెట్టి శ్రీనివాసరావును అభినందించారు. కార్యక్రమంలో కుందేటి రామకృష్ణ, కుందేటి శ్రీనివాసరావు, కుందేటి రమేష్, పసుపులేటి శివరామప్రసాద్, కుందేటి శ్రీమన్నారాయణ, ఎం.చంద్ర కిషోర్ పాల్గొన్నారు.

నిత్యావసరాలు, దుస్తులు పంపిణీ



పెసర్లంక(భట్టిప్రోలు): భారత్ వికాస్ పరిషత్ (బీవీపీ) తెనాలి బ్రాంచ్ సహకారంతో భట్టిప్రోలు మండలం పెసర్లంక పల్లెపాలెంలోని 70 వరద బాధిత కుటుంబాలకు రూ.1.12 లక్షల విలువ చేసే నిత్యావసర సరుకులు, దుప్పట్లు, చీరలు, లుంగీలు, కండువాలు, దోమతెరలు ఆదివారం అందజేశారు. బ్రాంచ్ కార్యదర్శి వై.హరిపూర్ణ ప్రసాద్, ఆర్థిక కార్యదర్శి పీబీవీ రమేష్‌బాబు, బీవీపీ అమరావతి సభ్యులు బి.శ్రీనివాసరావు, సరస్వతి శిశు మందిర్ తెనాలి ప్రధానాచార్యులు వి.రాజేంద్రకుమార్, ఎస్ఎస్ఎఫ్ తెనాలి ఖండ్ సుయోజక్ కడియాల సునీల్ కుమార్, ఆదామా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యం సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పెసర్లంక జెడ్పీ హైస్కూల్ ఆంగ్లోపాధ్యాయులు ఉల్లంగుంట వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్పృహ తప్పి పడిపోయిన వ్యక్తి
పోలీసులు వైద్యశాలకు పంపగా మృతి

తెనాలి రూరల్: రోడ్డుపై వ్యక్తి స్పృహ తప్పి పడిపోయాడు. అటుగా వెళుతున్న పోలీసు అధికారి చూసి కారు దిగి వచ్చి అతన్ని సిబ్బందితో వైద్యశాలకు పంపారు. చికిత్స పొందుతూ అతను మృతి చెందాడు. తెనాలి బస్టాండ్ ప్రాంతంలో ఉండే విజయకుమార్(68) వంట పనులకు వెళుతుంటాడు. ఆదివారం కొత్త వంతెనపై నడుచుకుంటూ వెళుతుండగా స్పృహ తప్పి పడిపోయాడు. అటుగా వెళుతున్న డీఎస్పీ జనార్దనరావు చూసి అతనిని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అయినా అతను మృతి చెందాడు.

తవ్వి వదిలేశారు


22వ వార్డులో లీకుల మరమ్మతుల కోసం రోడ్డును తవ్వి వదిలేసిన దృశ్యం


కృష్ణా టాకీసు సెంటరులో తవ్వి వదిలేయడంతో గోతులమయంగా మారిన రోడ్డు

మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంతో రేపల్లె వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మంచినీటి పైపులకు ఏదో ప్రాంతంలో లీకులు ఏర్పడుతుండడంతో వాటి మరమ్మతుల కోసం రోడ్లను తవ్వేయడం మున్సిపల్ అధికారులకు రివాజుగా మారుతోంది. తాజాగా 22వ వార్డు లంబాడీ కాలనీ వీధిలో మున్సిపల్ పైపునకు ఏర్పడిన లీకుకు మరమ్మతులు నిర్వహించేందుకు సిబ్బంది రోడ్డును ఇష్టానుసారంగా తవ్వారు. తమ పని పూర్తయ్యాక రహదారి గోతులు పూడ్చలేదు. దీంతో ఆ దారిలో వెళ్లేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రుళ్లు గుంతలను గుర్తించక ప్రమాదాలకు గురవుతున్నారు. కృష్ణా టాకీసు సెంటరులోనూ ఇలాగే తవ్వి గుంతలను వదిలేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తవ్విన గుంతలను పూడ్చి రోడ్లను మళ్లీ వేయాలని స్థానికులు, ప్రజాసంఘాల నేతలు కోరుతున్నారు. – రేపల్లె రూరల్

జూదరుల అరెస్ట్

చందోలు(కర్లపాలెం): అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిపై చట్టప్రకారం కేసులు నమోదు చేసి శిక్షించేలా చర్యలు తీసుకుంటామని చందోలు ఎస్ఐ ఆర్.స్వామి శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం పిట్టలవానిపాలెంలోని ఖాజీపాలెంలో పేకాడుతున్న నలుగురిని ఎస్ఐ శ్రీనివాస్ తమ సిబ్బందితో కలిసి అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.3,650 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. చందోలు గ్రామ శివారు పొలాల్లో పేకాడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని రూ.1,500 నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు. జూదరులను కోర్టుకు హాజరు పరుస్తామని వివరించారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు



కొల్లిపర: ఇసుకను అక్రమంగా రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ పి.కోటేశ్వరరావు తెలిపారు. ఆయన శనివారం రాత్రి సిబ్బందితో కలసి మండలంలోని వల్లభాపురం, అత్తలూరిపాలెం గ్రామాల్లో గస్తీ ని ర్వహించారు. ఈ సందర్భంగా అత్తలూరి గ్రా మంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రా క్టర్‌ను గుర్తించారు. డ్రైవర్‌వద్ద ఎటువంటి ప త్రాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నా రు. కేసు నమోదుచేసి, ట్రాక్టర్‌ను రెవెన్యూ అధి కారులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

రేపు కొత్త సచ్చిదానందమూర్తి శతజయంతి


ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న వీరనారాయణ, రామరాజు

తెనాలి: భారతీయ తత్వశాస్త్రంలో విశేష కృషి చేసిన తెనాలికి చెందిన సుప్రసిద్ధ తత్వశాస్త్రవేత్త పద్మ విభూషణ్ కొత్త సచ్చిదానందమూర్తి శతజయంతిని ఈనెల 24వ తేదీన నిర్వహించనున్నారు. పట్టణానికి చెందిన వివేక ఎడ్యుకేషనల్ సొసైటీ, తెనాలి ఇంప్రెషన్స్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగే ఈ వేడుక ఆహ్వాన పత్రికను ఆదివారం సాయంత్రం వివేక విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ రావిపాటి వీరనారాయణ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ కె.రామరాజు ఆవిష్కరించారు. అనంతరం వివరాలను తెలియజేశారు. ఆరోజు ఉదయం 10.30 గంటలకు బుర్రిపాలెంరోడ్డులోని శ్రీవివేకానంద సెంట్రల్ స్కూల్ ఆవరణలోని థియేటరులో జరిగే శతజయంతి సభకు డాక్టర్ రావిపాటి వీరనారాయణరావు అధ్యక్షత వహిస్తారు. తెనాలి ఇంప్రెషన్స్ రూపొందించిన ‘పద్మవిభూషణ్ కొత్త సచ్చిదానందమూర్తి’ పుస్తకాన్ని కవి, రచయిత, రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ విశ్రాంత సంచాలకుడు వాడ్రేవు చినవీరభద్రుడు ఆవిష్కరిస్తారు. దళిత సార్వత్రిక విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి, ప్రజాసాహితి మాసపత్రిక ప్రధాన సంపాదకులు కొత్తపల్లి రవిబాబు విశిష్ట అతిథులుగా హాజరవుతారని తెలిపారు. తత్వశాస్త్రాన్ని సామాన్యులకు అర్థమయేలా కృషిచేసిన సచ్చిదానందమూర్తి, భారత నాగరికత, చరిత్ర, సాంఘిక అంశాలతో పాటు హిందూ ధర్మ శాస్త్రాలు, మెటాఫిజిక్స్, ఆఫ్రో ఏషియన్ ఫిలాసఫీలపై ఇంగ్లిష్‌లో 30పైగా, తెలుగులో 12కు పైగా అత్యంత ప్రాముఖ్యత కలిగిన గ్రంథాలను రచించినట్లు వీరనారాయణరావు తెలిపారు. ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్‌గా, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్‌గా, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ఉపాధ్యక్షుడిగా వ్యవహరించినట్లు వివరించారు. కార్యక్రమంలో మురళి, కె.రిషిత, పి.మోనాలి పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరంలో 150 మందికి పరీక్షలు


పరీక్షలు చేస్తున్న డాక్టర్ భాస్కరరావు

తెనాలి రూరల్: పట్టణ మారిస్‌పేటలోని రాక్ గాస్పెల్ చర్చిలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. సంఘ కాపరి బిషప్ పినపాటి జాన్‌పాల్ సహకారంతో గంగానమ్మపేటకు చెందిన శ్రీలక్ష్మి విజన్‌కేర్ సెంటర్ వైద్యులు శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సుమారు 150 మందికి పరీక్షలు చేశారు. వీరిలో 50 మందికి కళ్లజోళ్లు, 100 మందికి మందులను ఉచితంగా అందజేశారు. త్వరలో 10 మందికి కంటి శుక్లాల శస్త్ర చికిత్సలను ఉచితంగా చేయనున్నట్టు విజన్ కేర్ సెంటర్ నిర్వాహకుడు డాక్టర్ భాస్కరరావు తెలిపారు. తమ వైద్యశాల ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా రాక్ గాస్పెల్ చర్చిలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్టు ఆయన చెప్పారు. కార్యక్రమాన్ని చర్చి సంఘ పెద్దలు పినపాటి డేవిడ్ రాజు, ఈపూరి శ్రీనివాసరావు, కసుకుర్తి భాస్కర రావు, జైరాజు, ఈపూరి ఏసురత్నం, పినపాటి ఫ్రాన్సిస్, కలెవరపు ఏసుదాస్ పర్యవేక్షించారు.

ప్రగతి పథంలో కాకతీయ కో–ఆపరేటివ్ సొసైటీ

సర్వసభ్య సమావేశంలో చైర్మన్ దావులూరి లక్ష్మీకాంతారావు


లక్ష్మీకాంతారావును సత్కరిస్తున్న డైరెక్టర్లు

తెనాలి: కాకతీయ మ్యూచ్‌వల్లీ ఎయిడెడ్ థ్రిఫ్ట్ అండ్ క్రెడిట్ కో–ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్, తెనాలి 23వ వార్షిక సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. స్థానిక కొత్తపేటలోని ఎన్జీవో కల్యాణ మండపంలో ఏర్పాటైన సమావేశానికి సొసైటీ చైర్మన్ దావులూరి లక్ష్మీకాంతారావు అధ్యక్షత వహించారు. సొసైటీ సీఈవో కనమర్లపూడి ఝాన్సీలక్ష్మి వార్షిక నివేదికను సమర్పించారు. సభ్యులు, ప్రజల సహకారం, ఆదరణతో సొసైటీ పురోగమిస్తోందని లక్ష్మీకాంతారావు వెల్లడించారు. సొసైటీ తరపున సిక్స్ సిగ్మా చెస్ అకాడమీ ఛాంపియన్‌షిప్‌లో విజేతలైన చిన్నారులకు నగదు బహుమతులు, పేద విద్యార్థులకు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్లు, సభ్యులు చైర్మన్ లక్ష్మీకాంతారావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు వేదాంతం సుబ్రహ్మణ్యశాస్త్రి, షేక్ ఖలీల్, దావులూరి చక్రధర చౌదరి పాల్గొన్నారు. తొలుత సాంస్కృతిక కార్యక్రమాల్ని ప్రదర్శించారు.

సైబర్ నేరాలు, మోసాలపై అప్రమత్తత అవసరం


ప్రజలతో మాట్లాడుతున్న పోలీసులు

తెనాలి రూరల్: సైబర్ నేరాలు, మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు డీఎస్పీ బి.జనార్దనరావు ఆధ్వర్యంలో వారధి కార్యక్రమాన్ని ఆదివారం రాత్రి స్థానిక ఫుడ్ గ్రెయిన్స్ అండ్ కిరాణా మర్చంట్ అసోసియేషన్ హాలులో పోలీసులు నిర్వహించారు. సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, ఓటీపీ, ఈకేవైసీ మోసాలు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ వంటి వాటిపై వీడియో రూపంలో ప్రజలకు అవగాహన కల్పించారు. అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ మల్లికార్జునరావు, టూ టౌన్ సీఐ నిస్సార్ బాషా, రూరల్ సీఐ బెల్లం శ్రీనివాసరావు, పలువురు వ్యాపారులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జోలికి వస్తే సహించేది లేదు

- జేఏసీ సభ్యుల నిరసన
- రఘురామ కృష్ణంరాజు దిష్టిబొమ్మ దహనం


రఘురామ కృష్ణంరాజు దిష్టిబొమ్మను దహనం చేస్తున్న జేఏసీ సభ్యులు

తెనాలి రూరల్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్ ఫ్లెక్సీని ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజు చించడాన్ని నిరసిస్తూ తెనాలిలో జేఏసీ సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. స్థానిక గాంధీ చౌక్‌లో ఆయన దిష్టిబొమ్మను ఆదివారం రాత్రి దహనం చేశారు. అంబేడ్కర్ జోలికి వస్తే సహించేది లేదని, రఘురామ కృష్ణంరాజు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యాక్రమంలో జేఏసీ నాయకులు కనపర్తి అనిల్, బొనిగల ప్రదీప్, కారుమంచి సునీల్, గడ్డేటి సుందరరావు, అక్కిదాసు కిరణ్ కుమార్, కంచర్ల కోటేశ్వరరావు, కంచర్ల శ్రీను, బండికళ్ల బుల్లయ్య, మంచాల సందీప్, జమ్మి సతీష్‌బాబు పాల్గొన్నారు.

రఘురామరాజుపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

తెనాలి డీఎస్పీకి ఫిర్యాదు చేసిన ఎస్సీ నేతలు


డీఎస్పీ జనార్దనరావుకు ఫిర్యాదు అందజేస్తున్న నాయకులు

తెనాలి: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించిన ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదుచేయాలని పలువురు ఎస్సీ నాయకులు ఆదివారం తెనాలి డీఎస్పీని కలిసి ఫిర్యాదు చేశారు. రఘురామ కృష్ణంరాజు అంబేడ్కర్ ఫ్లెక్సీని తొలగించడం క్షమించరాని నేరమని తెలిపారు. మొదటి నుంచి ఆయన దళితులపై అక్కసు వెళ్లగక్కుతున్నారని, దేశం మొత్తం గౌరవించే అంబేడ్కర్‌ను అవమానించడం దారుణమని ఖండించారు. రఘురామపై కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా ఆయన్ను వెంటనే టీడీపీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగం పట్ల నిజమైన విశ్వాసం చూపుతానని రాగద్వేషాలకు పోను అని, ప్రజలతో శాంతి సమాధానాలతో ఉంటానని రాజ్యాంగం మీద ప్రమాణం శాసనసభ్యుడే ఇలాంటి రెచ్చగొట్టే పనులు చేయడం హేయమైన చర్యగా పేర్కొన్నారు. కార్యక్రమంలో తెనాలి బీఎస్పీ నేత కారుమంచి సునీల్ సందీప్, బొనిగల ప్రదీప్, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు గడ్డేటి సుందర్ సునీల్ కుమార్, గాలి వెంకట్, పిల్లి తిమోతి, బొడ్డు డేవిడ్, అరిగ ప్రసాద్, పిల్లి దాసు, పిల్లి రాజేష్, సముద్రాల కన్నా, వంపుగళ్ల సురేష్, గోవతోటి మనోజ్, వాసుమల్ల వేణు పాల్గొన్నారు.

విద్యార్థులకు టీషర్టులు అందజేత

రేపల్లె రూరల్: రాజకీయాల్లో యువతను భారతీయ జనతా పార్టీ ప్రోత్సహిస్తోందని ఆ పార్టీ నాయకుడు పిన్నిసాంబశివరావు అన్నారు. పట్టణంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో ఆదివారం విద్యార్థులకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చిత్రాలను ముద్రించిన టీషర్ట్‌లను ఆయన అందజేశారు. దేశాభివృద్ధి కోసం యువకులు రాజకీయాల్లోకి రావాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సీహెచ్ కిషోర్, వసతి గృహ అధికారి పావులూరి శివశంకర వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రఘురామపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి


జోగి రాజా

బాపట్ల: బీఆర్ అంబేడ్కర్ ఫొటో ఉన్న ఫ్లెక్సీని అత్యంత అవమానకరంగా చించివేసిన టీడీపీ ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ పట్టణ అధ్యక్షుడు జోగి రాజా డిమాండ్ చేశారు. కాకినాడ రూరల్ జనసేన ఎమ్మెల్యే పంతం నానాజీ, ఆయన అనుచరులు కలిసి ఒక దళిత డాక్టరు ఉమామహేశ్వరరావును బూతులు తిట్టడంపైనా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ రెండు వ్యవహారాల్లో డీజీపీ జోక్యం చేసుకోవాలని జోగి రాజా కోరారు.

హామీల అమలుకు కృషి

చావలి(వేమూరు): ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తెలిపారు. వేమూరు మండలంలోని చావలి గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం జరిగింది. ప్రతి ఇంటికీ వెళ్లి గోడలపై పోస్టర్లు అతికించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ విష్ణుమొలకల శ్రీనివాసరావు, మండల ప్రత్యేకాధికారి విలియమ్స్, తహశీల్దారు సుశీల, ఇన్‌చార్జి ఎంపీడీఓ అనురాధ, తెలుగు దేశం మండల పార్టీ అధ్యక్షులు దండే సుబ్బారావు, జనసేన నియోజక వర్గం సమన్వయకర్త ఉసా రాజేష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు


కొల్లిపర: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన ఆదివారం మధ్యాహ్నం కొల్లిపరలోని హోలీక్రాస్ పాఠశాల సమీపంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం రెండు మోటార్ సైకిళ్లు పాఠశాల సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మండలంలోని పిడపర్తిపాలేనికి చెందిన కంచర్ల ఏసోబుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 ద్వారా తెనాలి ప్రభుత్వ వైద్య శాలకు తరలించారు. ప్రమాదంలో మరొక వ్యక్తి కొల్లిపర గ్రామానికి చెందిన యువకుడు. ఇతనికి స్వల్పంగా గాయాలయ్యాయి.

ప్రజ్ఞాచారికి జాతీయ సాహితీ సేవా పురస్కారం



తెనాలి రూరల్: మండలంలోని కొలకలూరుకు చెందిన సాహితీరత్న డాక్టర్ నూతక్కి పూర్ణప్రజ్ఞాచారి జాతీయ సాహితీ సేవా పురస్కారానికి ఎంపికయ్యారు. షిర్డీ సాయినాథుని 189వ జయంతిని పురస్కరించుకుని చిలకలూరిపేటకు చెందిన జయ జయ సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో సాయి మహానుభావా సాహితీ సేవ జాతీయ పురస్కారాన్ని అందించనున్నారు. దశాబ్దాల నుంచి సాహితీ సేవ చేస్తున్న పూర్ణ ప్రజ్ఞాచారిని జాతీయ పురస్కారానికి ఎంపిక చేసినట్టు ట్రస్ట్ చైర్మన్ పూసపాటి బాలాజీ తెలిపారు. చిలకలూరిపేట శ్రీ సాయి టెక్నో స్కూల్ ఆవరణంలో ఈ నెల 28న పురస్కారం ప్రదానం చేయనున్నట్టు చెప్పారు.

డీబీఆర్‌సీ ఆపన్నహస్తం



కొల్లూరు : వరద పీడీత కుటుంబాలకు దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆపన్న హస్తం అందించింది. ఆదివారం మండలంలోని చిలుమూరులంక, తోకలవారిపాలెం, రావిలంక గ్రామాలకు చెందిన 450 వరద బాధిత కుటుంబాలకు డీబీఆర్‌సీ ఆధ్వర్యంలో నిత్యావసర సరకులు, టార్పాలిన్ పరదాలు, బకెట్లు పంపిణీ చేశారు. నది మధ్యలోని రావిలంకలో నివసిస్తున్న కుటుంబాల వద్దకు పడవలో నిత్యావసర సరకుల బాక్స్‌లను తరలించి పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీబీఆర్‌సీ ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ అల్లాడి దేవకుమార్, తోకలవారిపాలెం సర్పంచి టి.కృష్ణమోహన్, డీబీఆర్‌సీ ఫైనాన్స్ మేనేజర్ నాగలక్ష్మి, సిబ్బంది రవితేజ, శ్రీలత, భగవాన్, సీపీఎం నాయకుడు పంతగాని నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.